


# రంగు మారింది!

ఎ.కె. కరుణాకర్

ఫట్. . .ఫట్. . .ఫట్ టుక్. . . టుక్ సుబ్బారావ్ డకోటా సెకండ్ హేండ్ మోటార్ సైకిల్ గారేజీలో ఆగింది. హడావుడిగా బండికి స్టాండ్ వేసి చకచక మెట్లెక్కి ముఖాన పట్టిన చెమటని కర్చీప్‌తో తుడుచుకుంటూ ఆఫీసు రూమ్‌లోకి అడుగు పెట్టాడు సుబ్బారావ్. ఎక్కౌంట్స్ పుస్తకంలో ముఖం దూర్చి లెక్కలు రాస్తున్న కాషియర్ ముకుందరావు తలెత్తి చూశాడు.

“సారీ, పది నిమిషాలు లేటయింది” తడబడుతూ అన్నాడు, సుబ్బారావ్.

“ఏమిటి నీ వాచ్ పది నిమిషాలే లేటుగా చూపిస్తుందా. మరి ఆఫీసు గడియారం ఎంత చూపిస్తుందో చూడు” గోడ కున్న గడియారం వైపు చూపిస్తూ అన్నాడు ముకుందరావు.

“ఐ. . .ఐ. . . మరేమో. . .” ఏదో చెప్ప బోతున్న సుబ్బారావుని మధ్యలోనే ఆపి “సరేలే ఏదో కొత్త కథ తయారు చేసుకుని వచ్చినట్టున్నావు. తీరిగ్గా తరవాత చెబుదువు కాని, ముందు ఈ స్టేట్‌మెంట్ త్వరగా టైప్ చేసి పెట్టు” అంటూ అందించాడు రావు.

‘బచ్చు’స్ ప్రయివేట్ లిమిటెడ్’ లో ఆఫీసు సిబ్బంది మొత్తం ఆరు మంది ఇంక్లూడింగ్ మేనేజర్ బచ్చేశ్వరరావు. మిగతా ఐదుగురూ, ది గ్రేట్ క్లర్క్ కమ్ టైపిస్టు సుబ్బారావ్, కాషియర్ ముకుందరావు,

స్టెనో లల్లీ ( లలితాంబ ). మరో ఇద్దరు చిన్న సైజు క్లర్కులు. ఆఫ్‌కోర్స్ అప్పుడప్పుడు ఆఫీస్ బాయ్ పనులు వాళ్ళే నిర్వహించేస్తుంటారు.

మరో ఐదు నిమిషాలకి బచ్చుగారు స్ప్రింగ్ డోర్ కాస్త ముందుకు తోసి తలని వాలుగు పొర్లు తూర్పు పడమరకి తిప్పి మూడు రోజులుగా మురిగి పోయిన పకోడీలు తిన్నట్టు ముఖం ముప్పై మూడు రంగుల్లోకి మార్చి ఎదురుగా కూర్చుని తన కేసే చూస్తున్న ముకుందరావుని చిరచిర లాడుతూ అడిగాడు.

"ఏమయ్యా మిస్టర్ రావ్! స్టెనో ఇంకా రాలేదా? ఈ రోజుకూడా బస్సు వాళ్ళు స్ట్రైక్ చేస్తున్నారా? అది సరే, సుబ్బారావన్నా వచ్చాడా?

"వచ్చాడు సార్! స్టేట్‌మెంట్ టైప్ చేస్తున్నాడు". సుబ్బారావ్ కూర్చున్న సీట్ వైపు చూశాడు మిస్టర్ బచ్చు. సుబ్బారావ్ చేతి నిండా ఏంటో నల్ల రంగు పట్టించుకుని గాలిపటం ఎగరేస్తున్నట్టు పొడుగ్గా టైప్ రిబ్బన్ని, రిబ్బన్ స్పూల్‌కి చుడుతున్నాడు.

"ఏమయ్యా టైప్ చేశావా?" సుబ్బారావ్ వాలకాన్ని చూసి అడిగాడు మేనేజర్.

"హి. . .హ్హి. చె. . .చ్చె. . . చెయ్యాలనే అనుకున్నాను సార్. కాని పోల్డ్ రిబ్బన్ టైప్ పడట్లేదు. అందుకని అది తీసేసి కొత్త రిబ్బన్ వేస్తున్నాను. ఇంతలోనే ఈ రిబ్బన్ ఒక పక్కకి జారుకుంటూ ఇంత పొడుగున జారి పోతేను మళ్ళీ చుడుతున్నాను. మరేం లేదు సార్ అయి పోతుంది కొట్టేస్తాను".

"కొడతావయ్యా. కొడతావ్ మరో గంటకి అవతల అది అర్జెంటని నేనిస్తే నువ్వు ఇదన్న మాట చేసి పెడుతున్నావు."

ఇంతలో బచ్చుగారికి ఎదురుగా ముసిముసి నవ్వులతో, ముద్దులొలికే సోయగాలతో రంభలా ప్రత్యక్షమైంది మిస్ లలితాంబ సారి స్వీట్ స్టెనో లల్లీ. బచ్చుగారి కళ్ళల్లో మాట తొంభై తొమ్మిది కళలు వెల్లివిరిశాయి. ఆ కళ్ళతోటే ముద్దు పెళ్ళాన్ని పిల్చినట్టు విష్ చేశారు ది గ్రేట్ మేనేజర్ బచ్చు. వెంటనే డైలాగులు సీరియస్‌గా స్టాఫ్ ముందు తొణికిన ఛోట తొణక్కుండా తంటాలు పడుతూ ధైర్యంగా (వెనక భయం, ఎక్కడ మిస్ లల్లీ చురచురలాడుతుందోనని, అయినా బచ్చుగారి ప్రెస్టేజి స్టాఫ్ ముందు ఏంగాను? అందుకే) ఇలాగా మొదలెట్టేశారు—

"మిస్ లలితాంబా, వాట్ హాపెండ్ టు డె, యూ ఆర్ సో లేట్ హ !?"

"సారీ సార్! వస్తూంటె. . ." ముద్దులరాణి ముద్దు ముద్దుగా పెదాలు కదపబోతూంటే అంతలోనే—

"కమిన్—అర్జంట్‌గా డిక్టేషన్ ఇవ్వాలి" అని తన సీట్లోకి కదిలాడు మిస్టర్ బచ్చు. ఆ వెంటనే నడుము నాట్యమాడిస్తూ, బరువులు బద్ధకంగా లయకలుపుతూ ఉంటే ( బరువులు మరేం కాదు హాండ్ బాగ్‌లో ఉన్న లిపిస్టిక్ ఇంకా టాయిలెట్ సరంజామా) ముందుకు కదిలింది స్వీట్ స్టెనో లల్లీ స్ప్రింగ్ డోర్ నెట్టుకుంటూ.



దీర్ఘాలోచనలో చిత్రం— ఇ. గోపాలరావు

ఈ చక్కటి సన్నివేశం చూస్తున్న స్టాఫ్ హాయిగా ఫీలయ్యారు. కారణం, మేనేజరుగారు ఇక బయటకు రారు. వచ్చినా వీళ్ళేం చేస్తున్నది పట్టించుకోరు.

స్టేట్‌మెంట్ కంప్లీట్ చేసి ముకుందరావు కందించాడు సుబ్బారావు. ముకుందరావు మెల్లగా అడిగాడు, "ఇందాకేదో కథ చెప్పడం మొదలెట్టావ్. అదేదో చెప్పు. ఇక మనం చేసే పనేముంది కనక!" తన సీటు పక్కన ఉన్న కుర్చీ చూపించి కూర్చో మన్నాడు హాస్యధోరణిలో. గోడవైపు చూశాడు సుబ్బారావు. "లంచ్ టైం కావస్తూంది. లంచ్‌కెళ్ళి వచ్చిన తరవాత తాపీగా ముచ్చట్లైన ఆమ్మాయి కథ చెబుతాను. ఇక మనం బైటకు వెళ్దామా!" అడిగాడు సుబ్బారావ్. "ఉండు ఈ స్టేట్‌మెంట్ మన బాస్‌కి ఇచ్చేసి వస్తాను" అంటూ స్టేట్‌మెంట్ తీసుకుని లోపలికి వెళ్ళాడు.

ముకుందురావుకి పఠిబై అయిదేళ్ళుంటాయి. తల మీదున్న వెంట్రుకలు పూర్తిగా నల్లగా లేక పోయినా కనబడ్డానికి ముకుందరావు నవమన్మధుడిలా ఉంటాడు. దానికి తగ్గ హుషారు, యువ్వనం కుర్రాళ్ళు పెర్రిగా కబుర్లు చెబుతుంటే బుర్ర బద్దలు కొట్టుకుంటూ మరీ వింటాడు. అందుకే ముకుందరావుకి, సుబ్బారావ్‌కి మంచి స్నేహం. 'కుర్రకారు కబుర్లంటే పడి చస్తాడు" అన్న విషయం సుబ్బారావ్‌కి బాగా తెలిసిపోయింది. అందుకే తన తప్పులేమన్నా ఉంటే ( ఆఫీసు విషయంలో మాత్రం ) ఆ రోజు యువజంట కథలు రెండు ( కల్పించైనా సరె ) ముకుందరావు పక్కన జేరి వూదేస్తూ ఉంటాడు ది గ్రేట్ సుబ్బారావ్. కాని నిజంగా ఈరోజు నిన్న జరిగిన సంగతి ముకుందరావు చెరకు రసం తాగినట్టు ఫీలయ్యేలా చెప్పాలను కున్నాడు సుబ్బారావ్.

మేనేజర్ రూమ్‌లోంచి బయటకొచ్చి "పదపోయ్ సుబ్బారావ్" అన్నాడు. ఇద్దరూ హోటల్ వైపుకి నడిచారు. మొగతా ఇద్దరు క్లర్కులూ వాళ్ళదో స్నేహం. వాళ్ళిద్దరు కలిసి మరో హోటల్‌కి చెక్కేశారు. మరి స్టెనో లల్లీ సంగతి? ఏముంది మేనేజర్ బచ్చుగారి తోనే. . . తినేది టిఫిన్.

మరో అర గంటలో సుబ్బారావ్, ముకుంద రావు ఆఫీసు రూమ్‌లోకి అడుగు పెట్టారు. ముకుందరావు ఆగలేక ఆగలేక అడిగేశాడు.

"చెబుతా నన్న ఆ కథేంటో చెప్పెద్దూ. . . సస్పెన్స్‌తో నేను చావలేక చస్తున్నాను. ఇంతకీ ప్రేమకథా, పెళ్ళి కథా లేక సంసారం కథా. త్వరగా చెప్పు."

"ఒక్క నిమిషం ఓపిక పడతారా. సిగరెట్టు వెలిగించి మొదలెడతాను."

'వెలిగించుక వయ్యా. త్వరగా వెలిగించుకో.' సుబ్బారావ్ సిగరెట్ అంటించాడు. గట్టిగా దమ్ము లాగి వూదాడు. 'కహ్హా కహ్హా' ముకుందరావు ముక్కులోకి పోయిందా పొగ.

'సారి సార్, మరీ మీ ముఖం నా ముఖం దగ్గర పెట్టేశారు. నేను కాస్త గట్టిగానే చెబుతా లెండి, ముఖం మరి కాస్త దూరంగా పెట్టుకో కూడదటండీ' రిక్వెస్టు చేసుకున్నాడు సుబ్బారావ్. ముకుందరావు అలాగే అన్నట్టు కాస్త వెనక్కి జరిగి కూర్చుని, కంట్లో తిరిగిన కన్నీళ్ళని కళ్ళద్దాల వెనక నుంచే తుడిచేసుకున్నారు పాపం.

సుబ్బారావ్ కాస్త గొంతు సవరించుకుని కథ చెప్పడం మొదలెట్టాడు.

అయితే వీళ్ళ కథలు, కబుర్లు పక్కనే ఉన్న బచ్చుగారి రూమ్‌లోకి వినబడవటండీ అయనొచ్చి గొడవ పెట్టేయడూ అంటే అబ్బే అటువంటి డిస్టర్బెన్స్ ఆయన ఫీల్ కాడండీ, ఎందుకంటే ఆయన ఆఫీస్ లోకంలో ఉండడు. ఏవేవో స్టెనోకి చెప్పేస్తూ ఉంటాడు డిక్టేషన్స్‌లో.

నిన్నటి మాట. ఆఫీసు కని సుబ్బారావ్ డకోటా మోటార్ బండిమీద రయ్యిమని వస్తూ ఉన్నాడు. రోడ్డు మీద ఒక్క సిటీ బస్సు నడుస్తున్నట్లు అగుపించలేదు సుబ్బారావుకి. కారణం బస్ స్టేజీల మీద ఏ మాత్రం జనం కనబడట్లేదు. ఆటో రిక్షాలు మటుకు నెలలు నిండిన మహిళల్లా నిండుగా బరువుగా పనుల మీదెళ్ళే జనాల్ని నింపుకుని అటు ఇటు తెగ తిరిగేస్తున్నాయి.

ఇంతలో ఒక బస్ స్టాండ్ దగ్గర సుబ్బారావు కళ్ళు జిగేలుమని మెరిసేట్టు ఒక అందాల రాసి భుజాన అందమైన రంగులతో అల్లిన గోనె సట్టా సంచి తగిలించుకుని ఎటో దూరాన ఎవరి రాక కోసమో అన్నట్టు చూస్తూంది.

సుబ్బారావ్ మోటార్ బైస్కిల్ 'భడ. . .భడ మంటూ అనుకోకుండా ఆ అమ్మాయి నిలుచున్న దగ్గరలోనే ఆగిపోయింది. దాన్ని మరి కాస్త ( స్టైల్‌గా ) నెట్టుకుంటూ, ఫుట్‌పాత్ పక్కగా కిళ్ళీషాప్ దగ్గరగా ఆపి స్టాండ్ వేశాడు. ఆ అమ్మాయిని చూడనట్టుగా పోజు పెట్టి కిళ్ళీ షాపు దగ్గరికి నడిచాడు.

సుబ్బారావ్ తలలో విష్ణు చక్రంలా ఆలోచనలు గిర్రున తిరగడం మొదలెట్టాయి.

ఈ సుందరాంగి బాపు చిత్రించిన చిత్రంలా

చూస్తున్న కొద్దీ తనలో ఏదో ఆశ పైకి జిలేబీలా పొంగుతుంది. ఈ అమ్మాయి తన నాలుగు వేల ఖరీదైన బండి మీద నాజూగ్గా కూర్చుని, తన వీపుకి సున్నితంగా ఆనుకుంటూ తనతోపాటు కనీసం అర గజం దూరమైనా వస్తే, అతని కంటే ఘను డెవరు, సారి అదృష్టవంతు డెవరుంటారు?

తను మాత్రం ఆ అమ్మాయి ముందు అందంలో కాని, చందంలో కాని తీసి పోయాడా? లేదే? పద్మనాభం లాంటి పర్సనాలిటీ. రాజబాబు లాంటి ఫేస్‌కట్. మాడా లాంటి నడక. అబ్బబ్బ సినిమా తారల అందరి అంద చందాలు తనలో ఇమిడి ఉన్నాయే. . . ఏ అమ్మాయి కాదంటుంది తన బండి మీద ఎక్కమంటే?

ఒకసారి తన క్రొత్త సినిమా హీరోల విగ్గులను తలదన్నేటట్లు మాడు బిళ్ళాడిన ముప్పై పైసల దువ్వెనతో సవరించుకున్నాడు సుబ్బారావ్.

సిగరెట్ పాకెట్ ఒకటి తీసుకుని ఒక్క సిగరెట్ కూడా వెలిగించకుండా బండి మీద వచ్చి కూర్చున్నాడు. రెండున్నర నిముషాలకి ముప్పై మూడు కిక్కులతో రావ్‌గారి బండి స్టార్టయి, ముందుకి కదిలి చిన్నసైజు టర్నింగ్‌తో ఆ అమ్మాయి దగ్గరకు వచ్చి ఆగింది. ( ఆపాడు . )

"మేడమ్, మీరెక్కడికెళ్ళాలి? రండి దిగ బెడతాను బస్సెస్ ఈరోజు కంప్లీట్‌గా నడవవట!" ( ఏమో తనకి మాత్రం పూర్తిగా తెలీదు.) టకటక అనేశాడు సంశయించకుండా సుబ్బారావ్.

ఆ అమ్మాయి ఒక మారు సుబ్బారావ్ వంక చూసి "ఫరవాలేదు" ముక్తసరిగా జవాబిచ్చింది.

"ఫరవాలేదు రండి నాకేమీ అభ్యంతరం ఉండదు!" సుబ్బారావుకెప్పుడూ అభ్యంతరం ఉంటుంది కనుక! ఊరికే అలా అన్నాడు అంతే! )

ఆ అమ్మాయేమనుకుందో, కాస్త పోష్‌గా తిరిగే అమ్మాయిలా "సరే" అంటూ సుబ్బారావు బండి దగ్గరకి వచ్చి నిలుచుంది. "ఫరవాలేదు కూర్చోండి." కూర్చుంది. "ఎక్కడికెళ్ళాలి మీరు?" సుబ్బారావు ప్రశ్న. "వనితా కాలేజీకి" అమ్మాయి జవాబు. సరే—అన్నట్టు బండి స్పీడ్ పుంజుకుంది.

"ఆటోవాళ్ళు పిలిచినా ఆపట్టన్నారే!" మాట కలిపాడు సుబ్బారావ్. "అవునండి అన్నీ పాసింజర్స్‌తో వెళ్ళిపోతున్నాయి. అనుకోకుండా ఒక ఖాళీ ఆటో వచ్చింది. ఆటో కడతావా అంటే ఎంత మంది అన్నాడు. నేనొక్కర్తినే అన్నాను. లాభం లేదండి అని వెళ్ళి పోయాడు. గంట నుంచి నిలుచున్నా, ఎందుకంటే ఈరోజు ఇంపార్టెంట్ క్లాసుందండి. కెమిస్ట్రీ గెస్ పేపర్ ఇస్తానంది మా మేడం" అంది ఆ అమ్మాయి.

"అలాగాండి" అన్నాడు సుబ్బారావ్. కాలేజీ వచ్చేసింది. అమ్మాయి దిగింది. సుబ్బారావ్‌కి థాంక్స్ చెప్పింది. ఆ వెంటనే గబగబా నడుచుకుంటూ కాలేజు ప్రెమిసెస్‌లోకి వెళ్ళిపోయింది.

సుబ్బారావ్ విన్నటి కథ అక్కడితో అయి పోయింది. మరి ఈరోజు కథ—!

సుబ్బారావ్ మళ్ళీ బస్ స్టాండ్ వద్ద వెయిట్ చేశాడు, ఆ అమ్మాయి వచ్చింది. వెంటనే బస్ వచ్చింది. ఆ అమ్మాయి ఇటుగానే చూస్తుందేమో చూసి పలకరిస్తుం దేమో అనుకున్నాడు, కాని అలా కాలేదు. బస్సు వచ్చిన వెంటనే తల ఎటూ తిప్పకుండా ( ఎటూ తిప్పకపోతే పోయింది సుబ్బారావేసన్నా తల తిప్పి చూడకుండా ) ఎంచక్కా ఎక్కేసింది బస్సు. డీలా పడిపోయి కాఫీ హోటల్‌కి పోయి ఒక కప్పుడు చల్లటి కాఫీ తాగి ఇవతల పడ్డాడు సుబ్బారావ్. నెమ్మదిగా తన వాహనాన్ని నడుపుకుంటూ వస్తున్నాడు. అతని మూడ్‌కి సరిపోయినట్లే బండి మధ్యలోనే అటకాయించింది. దాని మొహాన ఒక అయిదు రూపాయలు కొట్టి ( షాప్ రిపేరర్‌కి ) బాగు చేయించుకొచ్చేసరికి ఆ మాత్రం లేటయింది ఆఫీసుకి. ఇదీ ఈరోజు ఆఫీసుకి లేటుగా రావడానికి కారణం!" అని ముకుందరావుకి చెప్పాడు సుబ్బారావ్.

అప్పటిదాకా డాకలా నోరు తెరుచుకుని వింటున్న ముకుందరావు మళ్ళీ ఇలా అడిగాడు.

"ఆ అమ్మాయి మళ్ళీ ఈరోజు కనబడుతుందంటావా?!"

"ఏం మీరు ప్రేమిస్తారా?"

"జోవోయ్ బడాయి, ఒకవేళ కనబడితే— ఆ అమ్మాయి నీకు సరి తూగుతుందా లేదా అన్నది తేల్చి పారేస్తా" ( నిజంగా ముకుందానికి ఆ అమ్మాయిని చూడాలని లోలోన ఉవ్విళ్ళూరుతున్నాడు )

"ఓ యస్! ఆ అమ్మాయి కాలేజీ నుండి వచ్చే టైము అదే అవుతే మనం అక్కడికెళ్ళి వెయిట్ చేస్తే తప్పకుండా కనబడుతుంది!"

"అలాగైతే నేను ఈరోజు నీ బండి మీద వస్తాను ఏం !"

"రండి సార్!" అని చెప్పి తన సీట్లోకెళ్ళి కూర్చున్నాడు సుబ్బారావ్.

సాయంత్రం అయిదయింది. ఆఫీసునుంచి ఇద్దరూ కలిసి బయలుదేరారు.

సుబ్బారావు బండి లకిడీకా పూల్ మీదుగా కైరతాబాద్ దాటి ఎర్రమంజిల్ కాలనీ వైపు పరుగుతీస్తోంది. ముకుందరావు కేదో అనుమానం వచ్చినట్టు అడిగాడు. "నువ్వుండేది బంజారాహిల్స్‌లో కదా నిన్న ఇటువైపు కెందుకొచ్చినట్టు!"

"అదే సార్ మన లక్కు. అనుకోకుండా మా క్లాస్‌మేట్ బుచ్చిబాబు ఇంటి నుండి బయల్దేరుతుంటే ఎదురయ్యాడు. నాతో కలిసిపోదామని వచ్చాడట! వాళ్ళ చెల్లెలి పెళ్ళి ఉందని పెళ్ళి కార్డొకటిచ్చాడు. ఎలాగూ బస్సులు లేవు కదా అని వాణ్ణి అమీర్ పేటలో డ్రాప్‌చేసి మళ్ళీ ఆఫీసుకని బయల్దేరా ..."

పంజాగుట్ట కాలనీ బస్‌స్టాప్ వచ్చింది. సుబ్బారావ్ మాటలతోపాటు మళ్ళీ అదే స్పేస్‌లో బండిని స్టాప్ చేశాడు. ముకుందరావు కూడా బండి దిగి సుబ్బారావ్‌తోపాటు కిళ్ళీషాపు దగ్గిరగా నడిచాడు.

అంతలోనే మూట ఎనభై ఎనిమిది నంబరుగల బస్సు వచ్చి రెండు ఫర్లాంగుల దూరంలో అవతలి వైపు ఆగింది. సుబ్బారావ్ ఆత్రుతగా లేడీస్ ఎంట్రేన్సు నుండి దిగుతున్న జనాన్ని చూస్తున్నాడు. అంతలోనే "సార్ దిగుతుంది చూడండి! ఆ అమ్మాయే" గుర్తుపట్టి ముకుందరావుకు చూపిస్తున్నాడు.

కొంతమంది దిగిన తరవాత బస్సు ముందుకు కదిలిపోయింది.

ముకుందరావు కాస్త కళ్ళద్దాలు సరిచేసుకొని దిగిన ఆ అమ్మాయిని చూశాడు. ఫేస్‌లో ఫీలింగు మారింది ( కాఫీ డికాక్షన్‌లా )

"సార్ చూశారా! ఎలా ఉందంటారు? యామ్ ఐ లక్కీ ఆర్ నాట్" సుబ్బారావు సంబరపడిపోతూ అడిగేస్తున్నాడు.

"అల్లో ... అల్లో ... అల్లో ... ఏమయ్యా ముకుందం ఇంటిదాకా వచ్చి బస్ స్టాండ్ దగ్గర కాపలా కాస్తున్నావ్! ఏమిటి కథ కమామీషు?" ముకుందరావు భుజం మీద తట్టాడు ఒక నలభై ఏళ్ళ పెద్ద మనిషి.

"ఆ... అల్లో సన్యాసిరావ్ నువ్వా! ఇలా వూడి పడ్డావ్, వూరునుండేనా!" షాక్ నుండి తేరుకున్న ముకుందరావు అడిగాడు.

వీడెవడ్రా మధ్యలో పానకంలో పుడకలా అనుకొన్నాడు సుబ్బారావ్.

"అవునోయ్ మా వాడు ఏదో ఎయిర్ ఫోర్స్‌లో సెలక్షన్స్‌కని ఇక్కడికి వచ్చాడు. ఇంత పెద్ద వూరులో వాడేం సమలాయించుకుంటాడులే అని నేనూ వాడితో బయల్దేరాను. వాణ్ణి అక్కడే దిగబెట్టి నిన్ను చూసి పోదామని వచ్చా. ఇక్కడే హోటల్‌లో రూం తీసుకొన్నాం. బస్సుల్లో వస్తుంటే మా అమ్మాయి వసుంధర కనబడింది. ఇద్దరం ఇదుగో ఈ వచ్చిన బస్సులోనే దిగాం. దిగుతూనే నువ్విక్కడ ఉండడం చూసి ఇటు వచ్చాను. అదుగో మా అమ్మాయి." ఇంటి సందువైపు నడుచుకుంటూ వెళ్తున్న ఆ అమ్మాయినే చూపించాడు ఆ పెద్ద మనిషి.

సుబ్బారావ్‌కి గుండె టకీమని ఆగినంత పనైంది. "హారి ముసలి నక్కా! నీకింత చక్కటి కూతురుందని ఒక్కసారి చెప్పనేలేదే. నా విషయాలన్నీ అరటి పండు వలిచి నోట్లో పెట్టినట్టు చెప్పించుకుంటావే, ఇలా నన్ను ఫూల్‌ని చేస్తా వనుకోలేదే! ఇదన్నమాట సంగతి ఆ అమ్మాయిని చూపిస్తున్నప్పుడు మొకం ముసలి తొండలా రంగులుమారింది. లోలోపల పళ్ళు పటపటమని విరిగేట్టు బిగించి తెగ తిట్టేసుకున్నాడు. ముకుందరావుని మెల్లగా "వ ... వస్తానండి" అంటూ మోటరు సైకిలు వైపు పరుగు లాంటి నడకతో వెళ్ళాడు సుబ్బారావ్. ✱

ఉచితం ఉచితం !!

# తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పనిచేస్తుందో చూడండి. రోగి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక ప్యాకెట్ మందు పొందండి.

**LALIT AYURVEDIC PHARMACY (AW)**
**P.O KATRI SARAI (GAYA)**